# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక








సంపుటి :12 సంచిక :322 శనివారం 25-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


# దిగొచ్చిన కేంద్రం

**తటస్థ వేదికపై సీజేపీతో చర్చలకు అంగీకారం**

- కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కాక్రోచ్ ప్రతినిధులతో కేంద్రం భేటీ
- రెండు డిమాండ్లకు అంగీకారం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సమయం కోరిన మంత్రులు
- కొనసాగుతున్న ఆందోళన
- నేడు మరోసారి చర్చలు

దేశవ్యాప్త విద్యార్థి ఆందోళనల ఒత్తిడికి కేంద్రం వెనక్కి తగ్గింది. సీజేపీతో తటస్థ వేదికపై చర్చలకు అంగీకరించిన ప్రభుత్వం.. విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం డిమాండ్లను ఆమోదించింది. అయితే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం తీసుకునేందుకు ఒక రోజు గడువు కోరడంతో శనివారం మరోసారి చర్చలు జరగనున్నాయి.



2లో



పెల్లెట్ గన్లతో కాల్చారు..

## ఇదిగో సాక్ష్యం

- ప్రభుత్వం ఇకనైనా అబద్ధాలు చెప్పడం ఆపాలి
- విద్యార్థులకు తగిలిన పెల్లెట్ గాయాలను మీడియాకు చూపించిన రాహుల్ గాంధీ
- ధర్మేంద్ర ప్రధాన్ 'క్రిమినల్ ఎడ్యుకేషన్ మినిస్టర్' అంటూ తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ:
విద్యార్థులపై కాల్పులు జరిపి, లాఠీచార్జ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను 'క్రిమినల్ ఎడ్యుకేషన్ మినిస్టర్' అంటూ ఘాటో పదజాలంతో విమర్శించారు. భారతదేశ విద్యా వ్యవస్థ కుప్పకూలడానికి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని అన్నారు.జూలై 20వ తేదీ నిరసలపై భద్రతా దళాలు జరిపిన పెల్లెట్ గన్ కాల్పుల్లో గాయపడిన సా?ల్ అనే విద్యార్థిని మీడియా సమావేశంలో రాహుల్

-మిగతా 2 లో



## నీట్ అంశంపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు

- ధర్నా చౌక్‌ను ఎత్తేసింది బీఆర్ఎస్
- ఇప్పుడు అదే వేదికపై నిరసనలు చేయడం రాజకీయ నాటకం
- నీట్, పరీక్షల లీకేజీలపై బీజేపీ--బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్
నీట్ పరీక్ష లీకేజీ అంశంపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ధర్నా చౌక్‌ను ఎత్తేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు అదే ధర్నా చౌక్‌లో నిరసనలు చేపట్టడం రాజకీయ అవకాశవాదమని అన్నారు.ముందుగా కేటీఆర్ ధర్నా చౌక్‌లో ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వృద్ధాప్యంలోనూ విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతుంటే, ప్రతిపక్ష నేత కేసీఆర్ మాత్రం ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు.

-మిగతా 2 లో

జనావాసాల పరిధిలోనే

# ఇందిరమ్మ ఇండ్లు

**ఓఆర్ఆర్ లోపల నిరుపయోగ ప్రభుత్వ స్థలాల గుర్తింపుపై దృష్టి**

- పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల స్థలాల వినియోగానికి మార్గదర్శకాలు
- ఉపాధికి ఆటంకం లేకుండా పనిస్థలాలకు చేరువలోనే ఇళ్ల నిర్మాణం
- 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణం
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సబ్సిడీ.. భూమి ఖర్చు ప్రభుత్వానిదే
- తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్ల నిర్మాణానికి ప్రణాళిక
- ప్రభుత్వ స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సీఎం ఆదేశం


హైదరాబాద్ -
క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. ఈ అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలు గుర్తించాలని అధికారులకు ఆయన సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, వేరేచోట ఆయా శాఖలకు స్థలాలను కేటాయించాలని ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సీఎం

-మిగతా 2 లో



## ప్రధాని మోదీ భయపడ్డారు..

- నటుడు ప్రకాష్ రాజ్ ఎద్దేవా
- డర్ గయా.. భయపడ్డారు' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్య
- మోదీ వీడియో సందేశంపై ప్రకాష్‌రాజ్ ఎద్దేవా
- నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రధాని వీడియో విడుదల
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు.. కఠిన చట్టం తీసుకొస్తామని మోదీ హామీ
- యువతకు ధన్యవాదాలు తెలిపిన ప్రకాష్‌రాజ్
- ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో చర్చ
- మోదీ వీడియో, ప్రకాష్‌రాజ్ పోస్టుతో రాజకీయ దుమారం



2లో

## పేపర్ లీక్ చేస్తే 10ఏళ్ల జైలు, రూ. 10కోట్ల జరిమానా

2లో



- పేపర్ లీకేజీ చట్టాన్ని కఠినతరం చేయనున్న కేంద్రం
- జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!
- నీట్-యుజి వంటి పరీక్షల లీకేజీల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు
- లీకులకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్ష పత్రాల లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) చట్టం-2024కు సవరణలు చేస్తూ, దోషులకు మరింత కఠిన శిక్షలు విధించే ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## భారత్‌పై 10 శాతం అదనపు సుంకాలు..



- విధించిన ట్రంప్ సర్కారు
- ట్రంప్ ఆదేశాలతో శుక్రవారం నుంచే అమల్లోకి కొత్త టారిఫ్‌లు
- యూఎస్ ట్రేడ్ యాక్ట్-1974 సెక్షన్ 301 కింద చర్యలు
- యూఎస్‌టీఆర్ అధికారిక ప్రకటనతో స్పష్టమైన నిర్ణయం
- భారత్ ఎగుమతులపై అదనపు సుంకం ప్రభావం పడే అవకాశం
- టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, రత్నాలు, లెదర్ రంగాలకు ఎదురుదెబ్బ
- వ్యవసాయ, ఆహార ఉత్పత్తులతో పాటు ఇంజినీరింగ్ వస్తువులపైనా ప్రభావం
- అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్ కావడంతో ఆందోళనలో భారత పరిశ్రమలు

2లో

యువతరంతో

# పెట్టుకోవద్దు

**ఒక్కో మెట్టెక్కి కేంద్ర ప్రభుత్వాన్ని తొక్కుతారు**

- మేకిన్ ఇండియా అడిగితే లీకిన్ ఇండియా ఇచ్చిన బీజేపీ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- అవసరమైతే ఢిల్లీకి వెళ్లి విద్యార్థులకు అండగా ఉంటాం
- మోడీని ప్రశ్నిస్తే రేవంత్‌రెడ్డికి ఎందుకు కోపం
- బీఆర్ఎస్వీ నిరసనలో కేటీఆర్

హైదరాబాద్ -
'ప్రధాని మోడీ యువతరంతో పెట్టుకున్నారు. జాగ్రత్త పడాలి. స్వరం మారుతున్నది, నవతరం మారుతున్నది అని కేంద్రం తెలుసుకోవాలి. శ్రీలంకలో ఈ యువతరం ఉరికించి ప్రభుత్వాలను పాతరేసింది. అలాంటి యువతరంతో పెట్టుకోవద్దు. హక్కుల కోసం పోరాడుతున్న యువతరాన్ని తీవ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్తానీలు అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే విద్యార్థుల వద్దకు వెళ్లి అనేకసార్లు చర్చలు చేసి సమస్యలు పరిష్కరించాల్సి ఉండే. ఈ యువతరం ఈ జనరేషన్ సీబీఐ, ఈడీ, ఐటీలకు భయపడేది కాదు. కేంద్రంపై పొట్టు పొట్టు కోపంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని మెట్టు మెట్టు ఎక్కి తొక్కుతారు. ఈ విషయాన్ని మోడీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి.

-మిగతా 2 లో







## 1100 రోజులుగా జైల్లోనే ఇమ్రాన్ ఖాన్..

- సాయం చేయాలని ప్రపంచానికి ఇమ్రాన్ తనయుడు వినతి
- తండ్రి ఆరోగ్యం క్షీణించిందంటూ ప్రపంచానికి కాసిం ఖాన్ విజ్ఞప్తి
- అత్యవసర వైద్య చికిత్స లేకపోతే చూపు కోల్పోయే ప్రమాదమని ఆందోళన
- గత మార్చి నుంచి తండ్రిని కలిసే అవకాశం లేదన్న ఇమ్రాన్ కుమారులు
- విడుదల, న్యాయ సహాయం కోరినా స్పందించని పాక్ ప్రభుత్వం

హైదరాబాద్
పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టై 1100 రోజులు పూర్తైంది. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ ఆరోగ్యంపై ఆయన తనయుడు కాసిం ఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. తన తండ్రి ఆరోగ్యం బాగా లేదని, ఈ విషయంలో ప్రపంచం స్పందించి, సాయం చేయాలని కాసిం ఖాన్ కోరారు. ఇమ్రాన్‌కు అత్యవసర వైద్య చికిత్స అవసరమని, లేకుంటే ఆయన కంటిచూపు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. పాకిస్తాన్ ప్రధానిగా పని చేసిన ఇమ్రాన్‌ఖాన్‌ను తాజా ప్రభుత్వం 2023, ఆగష్టు 5న అరెస్టు చేసింది.అప్పటినుంచి ఆయన రావల్పిండిలోని అడియాలా జైలులో ఖైదీగా ఉన్నారు. ఆయనను తోషాఖానా అవినీతి కేసులో ఇస్లామాబాద్ ట్రయల్ కోర్టు దోషిగా తేల్చింది. ఇతర కేసుల్లో

-మిగతా 2 లో



కాళేశ్వరం బ్యారేజీల

## భవిష్యత్‌పై ఫోకస్

- కేంద్రానికి వెంటనే లేఖ రాయండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు
- జల్ శక్తి మంత్రత్వ శాఖ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ నుంచి స్పష్టమైన సాంకేతిక మార్గదర్శకాలు కోరాలి
- ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకే ఇప్పటి వరకు ఫ్రీ-ఫ్లో మోడ్‌లో బ్యారేజులు
- పూర్తి సాంకేతిక నివేదిక ఆధారంగానే తుది నిర్ణయం
- మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్-
కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజుల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ,

-మిగతా 2 లో

## నీట్ అంశంపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు



(మొదటి తరువాయి)

నీట్ లీకేజీపై రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తుంటే, కేటీఆర్ ఆలస్యంగా స్పందించడం రాజకీయ నాటకమని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పాలనలో పరీక్షల లీకేజీలు, ఉద్యోగ నియామకాలలో అవకతవకలు జరిగాయని, గ్రూప్-1 పరీక్షల నుంచి పలు నియామకాల వరకు లీకుల పర్వం కొనసాగిందని ఆరోపించారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల మరణాలకు కారణమైన గ్లోబరీనా సంస్థ నివేదికను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ఆ సంస్థ పేరు మార్చుకుని ఇప్పటికీ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందని, ఇందులో కేటీఆర్ పాత్రపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్ల నిధులు ఉన్నాయని చెబుతున్నారని, అందులో నుంచి పరీక్షల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను సున్నా సీట్లకు పరిమితం చేశారని, అయినా పార్టీ తన వైఖరిలో మార్పు తీసుకురాలేదని విమర్శించారు. విద్యార్థులు బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలకు దూరంగా ఉండాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. నీట్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు

## జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి తరువాయి)

అభిప్రాయపడ్డారు. అలా కాకుండా పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలన్నారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఒక్కో ఫ్లాట్ ను దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షల ఖర్చవుతుండగా ప్రభుత్వం ఇందులో 5 లక్షల రూపాయల సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు తన వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ల్యాండ్ కాస్ట్‌ను మాత్రం పూర్తిగా ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్ర నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్ నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. ఈ క్రమంలోనే ఆయా పరిధిల్లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీలు ఎన్.శ్రీధర్, వి.శేషాద్రి, రెవెన్యూ సెక్రెటరీ లోకేష్ కుమార్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హౌజింగ్ స్పెషల్ సెక్రెటరీ వీపీ గౌతమ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


## పెల్లెట్ గన్లతో కాల్చారు.. ఇదిగో సాక్ష్యం

(మొదటి తరువాయి)

హాజరుపరిచారు. అనంతరం మాట్లాడుతూ, త్రివర్ణ పతాకం పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలిపిన సాహిల్‌కు పెల్లెట్ గాయాలైనట్టు చెప్పారు. సాహిల్ తొడుక్కున్న టీషర్ట్ పైకి జరిపి అతనికి తగిలిన గాయాలను మీడియాకు చూపించారు. సాహిల్ కంటికి గాయమైందని, ఆ కంటి నుంచి అతను చూడలేకపోతున్నాడని చెప్పారు. ఇదీ మన దేశ భవిష్యత్తు. వేలాది మంది యువత పరిస్థితి ఇది. పెల్లెట్ గన్లతో కాల్పులు జరిపి లాఠీచార్జ్ చేశారు. వాళ్లు ఏం చేశారు? శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్నారని రాహుల్ తెలిపారు. పోలీసు రిక్రూట్‌మెంట్ కోసం సాహిల్ పరీక్ష రాశాడని, అయితే ప్రశ్నపత్రం లీక్ అయిందని చెప్పారు. అతని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ముతో పరీక్ష రాశాడని వివరించారు. ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం మానాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటాలు ఆడరాదని అన్నారు. పేపర్ లీక్‌లకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, కాల్పులు, లాఠీచార్జీలతో దమనకాండకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవస్థను నడుపుతున్న ప్రధాని క్షమాపణ చెప్పాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. 'దాడులు ఆపండి.. మా విద్యార్థులను బెదిరించడం మానండి' అని రాహుల్ అన్నారు. కాగా, పార్లమెంటు నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై పెల్లెట్ గన్లు ఉపయోగించారనే ఆరోపణలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు.

## ప్రధాని మోదీ భయపడ్డారు..

- -నటుడు ప్రకాష్ రాజ్ ఎద్దేవా
- -డర్ గయా.. భయపడ్డారు' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్య
- -మోదీ వీడియో సందేశంపై ప్రకాష్‌రాజ్ ఎద్దేవా
- -నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రధాని వీడియో విడుదల
- -ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు.. కఠిన చట్టం తీసుకొస్తామని మోదీ హామీ
- -యువతకు ధన్యవాదాలు తెలిపిన ప్రకాష్‌రాజ్
- -ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో చర్చ
- -మోదీ వీడియో, ప్రకాష్‌రాజ్ పోస్టుతో రాజకీయ దుమారం



న్యూఢిల్లీ :
ప్రధాని మోదీపై నటుడు ప్రకాష్ రాజ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పీఎం మోదీ విడుదల చేసిన ఒక ఓ వీడియో ప్రకటనను ఉద్దేశిస్తూ, ప్రకాశ్ రాజ్.. 'ఆయన భయపడ్డారని' వ్యాఖ్యానించడంతో సోషల్ మీడియాలో వివాదం చెలరేగింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ప్రధాని మోదీ అర్ధరాత్రి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు.ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని, పార్లమెంట్‌లో కఠిన చట్టం తీసుకువస్తామని ఆ వీడియోలో తెలిపారు. ఈ వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసిన ప్రకాష్ రాజ్ 'డర్ గయా(భయపడ్డారు) నేను భయాన్ని చూడగలను. నా దేశ యువకులకు ధన్యవాదాలు' అంటూ వ్యాఖ్యానించారు.

# దిగొచ్చిన కేంద్రం

- -తటస్థ వేదికపై సీజేపీతో చర్చలకు అంగీకారం
- -కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కాక్రోచ్ ప్రతినిధులతో
- -కేంద్రం భేటీ రెండు డిమాండ్లకు అంగీకారం
- -ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సమయం కోరిన మంత్రులు
- -కొనసాగుతున్న ఆందోళన
- -నేడు మరోసారి చర్చలు



**న్యూఢిల్లీ**
కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రారంభించిన ఆందోళనలు దేశవ్యా ప్తంగా వ్యాపించడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దేశ రాజధానిలోని జంతర్ మంతర్‌కు దాదాపు పదివేల మందికి పైగా తరలిరావడంతో చర్చలకు దిగొచ్చింది. మూడు డిమాండ్‌లను సీజేపీ నేతలు ప్రస్తావించగా.. రెండింటికి కేంద్రం అంగీకారం తెలిపింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌కు ఒక రోజు సమయం కోరడంతో ఢిల్లీలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. సీజేపీ డిమాండ్ మేరకు శుక్రవారం ఒక తటస్థ వేదికపై చర్చలు జరిగాయి. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన చర్చల్లో కేంద్ర ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రంగ, సౌరవ్ దాస్‌లు పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో నీట్ సహా విద్యావ్యవస్థలోని పలు కీలక అంశాలపై చర్చించారు. డిమాం డ్లను సీజేపీ లిఖితపూర్వ కంగా ప్రభుత్వం ముందుంచింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని స్పష్టం చేశారు. అయితే ఇందులో బాధిత కుటుం బాలకు పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ కు కేంద్ర మంత్రులు అంగీకారం తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం తీసుకోవడానికి ఒక్కరోజు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో నేడు కూడా చర్చలు కొనసాగనున్నాయి.

**కేంద్ర మంత్రి రాజీనామాపై సమయం కోరిన కేంద్రం : సీజేపీ ప్రతినిధులు**
కేంద్రం మంత్రులతో చర్చల అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం ముందు మూడు ప్రధాన డిమాండ్లు పెట్టామని తెలిపారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంపై కేంద్రం అంగీకరించిందని తెలిపారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సంబంధించి శనివారం వరకు కేంద్రం గడువు కోరిందని సౌరభ్ దాస్ చెప్పారు. సీజేపీ నేత అశుతోష్ రంక మీడియాతో మాట్లాడుతూ.. ధర్మేంద్ర ప్రధాన్ ను ప్రభుత్వం త్వరగా విధుల నుంచి తొలగిస్తుందని అనుకుంటున్నామని తెలిపారు.

**నేడు మరోసారి చర్చలు : జేపీ నడ్డా**
చర్చల అనంతరం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. దాదాపు రెండు గంటల పాటు చర్చలు జరిగాయని.. సీజేపీ ప్రతినిధులు మూడు ముఖ్యమైన డిమాండ్లను ఉంచారని వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై శనివారం మరో మారు చర్చిస్తామని వెల్లడించారు.

# పేపర్ లీక్ చేస్తే 10ఏళ్ల జైలు, రూ. 10కోట్ల జరిమానా

- - పేపర్ లీకేజీ చట్టాన్ని కఠినతరం చేయనున్న కేంద్రం
- - జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!
- - నీట్-యుజి వంటి పరీక్షల లీకేజీల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు
- - లీకులకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ
ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమలుల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలకు అవకాశమిచ్చే బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.
ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్పులపై దృష్టి సారించింది. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలను మరింత బలోపేతం చేసి, నిందితులకు సుదీర్ఘ జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించేలా ముసాయిదా బిల్లును సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై గురువారం ప్రధాని మోదీ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, ఇలాంటి ఘటనలను ఏ మాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. లీకులకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, కేసుల విచారణను వేగంగా పూర్తి చేసే విధానాన్ని కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు.
ప్రస్తుతం అమలులో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం ప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారిపై 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రవేశ పరీక్షల లీక్ ఘటనల నేపథ్యంలో ఈ శిక్షలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో జైలు శిక్షల కాలాన్ని పెంచడం, జరిమానాల మొత్తాన్ని భారీగా పెంచడం వంటి అంశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో భాగమైన అధికారులు లేదా వ్యవస్థీకృత నేర ముఠాల ప్రమేయం ఉన్న కేసుల్లో మరింత కఠిన నిబంధనలు అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.
ఇక, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఢిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, త్వరలోనే మరో నాలుగు కోర్టులను కూడా ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఈ కోర్టుల్లో పేపర్ లీకేజీలకు సంబంధించిన కేసులను ఏడాదిలోనే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇలాంటి కేసుల విచారణకు ఎక్కువ సమయం పడుతుండటంతో నిందితులకు శిక్షలు ఆలస్యమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యమివ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## కాళేశ్వరం బ్యారేజీలభవిష్యత్‌పై ఫోకస్

(మొదటి తరువాయి)

జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజులను ఫ్రీ-ఫ్లో (నీటి నిల్వ లేకుండా) విధానంలో నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని మంత్రి తేల్చిచెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజనీరింగ్ ఆధారాలు అన్నింటిని జతచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. "బ్యారేజులను ఎందుకు నీటి నిల్వకు, పంపింగ్‌కు వినియోగించడం లేదనే విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలి. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలి," అని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు

## యువతరంతో పెట్టుకోవద్దు


(మొదటి తరువాయి)

'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్రం చేసిన దాష్టికానికి నిరసనగా వారికి సంఘీభావంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిమంది యువతీ, యువకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆందోళన పేపర్ లీక్‌కి సంబంధించిందే కాదనీ, 12 ఏండ్లుగా కేంద్రం చేస్తున్న మోసాలు, ద్రోహాలపైన యువత ఆగ్రహంగా ఉందన్నారు. అసలు పని చేయకుండా కేవలం మతం పేరుతో తప్పించుకుంటున్నదని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ 24 కోట్ల ఉద్యోగాలు ఇయ్యలేనందుకే యువతరం బయటకొచ్చిందని చెప్పారు. యువతరానికి ఏ రాజకీయ నాయకుడి అండ లేదన్నారు. మేకిన్ ఇండియా అడిగితే లీకిన్ ఇండియాను బీజేపీ ఇచ్చిందని విమర్శించారు. పోరాడుతున్న విద్యార్థులకు అందరం అండగా ఉండాల్సిన అవసరముందని చెప్పారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాష్టికాన్ని, అణచివేతను చూస్తే ఎవరి మనసైనా కరగాల్సిందేనని అన్నారు. వాళ్ళు అడిగిన దాంట్లో అన్యాయం ఏముందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రధాని కుర్చీ అడిగారా?, కేంద్రమంత్రి కుర్చీ అడిగారా?అని అన్నారు. విద్యార్థులు కోరుతున్నట్టుగా ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెట్టిన పోలీసు కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని కోరారు. అక్రమ కేసుల నమోదుకు క్షమాపణ చెప్పాలన్నారు. దేశంలో కేంద్ర మంత్రుల కొడుకులు లైంగిక దాడులు చేస్తే వెంటనే బెయిల్ వస్తున్నది కానీ పేపర్ లీకులపైన ఎంత అడిగినా సమాధానం మాత్రం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఏ దేశం కోసం? ఏ ధర్మం కోసం? పేపర్ లీకులపైన సమాధానం చెప్పడం లేదో బీజేపీ నాయకులు చెప్పాలన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరీక్షా పే చర్చ ఎందుకు చేయట్లేదని అడిగారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధమే ఆపిన మోడీ పిల్లల కన్నీళ్లు, వారి మీద జరుగుతున్న దాడిని ఆపలేరా?అని ప్రశ్నించారు.

**కొడంగల్‌లో దాక్కున్న రేవంత్‌రెడ్డి**
ప్రధాని మోడీపైన తాను కొట్లాడితే రేవంత్ రెడ్డికి ఎందుకు కోపం వచ్చిందని కేటీఆర్ అడిగారు. మోడీని ప్రశ్నిస్తే యూత్ కాంగ్రెస్‌ని ఎందుకు పంపించి తనను అడ్డుకుంటున్నారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో కొట్లాడితే కొడంగల్‌లో రేవంత్ రెడ్డి దాక్కున్నారని విమర్శించారు. దేశమంతా నరేంద్ర మోడీని, ధర్మేంద్ర ప్రధాన్‌ని ప్రశ్నిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్‌తోపాటు తనను విమర్శిస్తున్నారని గుర్తు చేశారు. ఢిల్లీని వణికించి తెలంగాణ తెచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి విద్యార్థులకు అండగా నిలబడతామని చెప్పారు. యువత స్వతంత్రంగానే పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, వి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, టి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు తుంగబాలు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గ్యాదరి కిషోర్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌పై 10 శాతం అదనపు సుంకాలు..

- -విధించిన ట్రంప్ సర్కారు
- -ట్రంప్ ఆదేశాలతో శుక్రవారం నుంచే అమల్లోకి కొత్త టారిఫ్‌లు
- -యూఎస్ ట్రేడ్ యాక్ట్-1974 సెక్షన్ 301 కింద చర్యలు
- -యూఎస్‌టీఆర్ అధికారిక ప్రకటనతో స్పష్టమైన నిర్ణయం
- -భారత్ ఎగుమతులపై అదనపు సుంకం ప్రభావం పడే అవకాశం
- -టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, రత్నాలు, లెదర్ రంగాలకు ఎదురుదెబ్బ
- -వ్యవసాయ, ఆహార ఉత్పత్తులతో పాటు ఇంజనీరింగ్ వస్తువులపైనా ప్రభావం
- -అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్ కావడంతో ఆందోళనలో భారత పరిశ్రమలు



**వాషింగ్టన్**
భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అమెరికా ప్రభుత్వం అదనంగా 10 శాతం సుంకాన్ని విధించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఈ కొత్త సుంకాలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. అమెరికన్ వ్యాపారాలకు నష్టం కలిగించేలా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే దేశాలపై వాణిజ్య చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించే 'యూఎస్ ట్రేడ్ యాక్ట్ 1974'లోని సెక్షన్ 301కింద జరిపిన దర్యాప్తు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్(యూఎస్‌టీఆర్) కార్యాలయం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్. ఈ అదనపు 10 శాతం సుంకం కారణంగా ఎగుమతి రంగాలపై తీవ్రప్రభావం పడే అవకాశం ఉంది. టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, రత్నాలు, ఆభరణాలు, లెదర్ ఉత్పత్తులు, వ్యవసాయ, ఆహార ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, కొన్ని తయారీ రంగాలు దీనివల్ల దెబ్బతినే అవకాశం ఉంది.

## 1100 రోజులుగా జైల్లోనే ఇమ్రాన్ ఖాన్..

(మొదటి తరువాయి)

కూడా ప్రభుత్వ అతడిని అరెస్టు చేసి, జైలులో ఉంచింది. అప్పటినుంచి ఇప్పటిదాకా ఆయన బెయిల్‌పై కూడా విడుదల కాలేదు. ఆయనను కలిసేందుకు కూడా కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అనుమతివ్వడం లేదు. తక్కువసార్లు మాత్రమే ఆయనను కుటుంబ సభ్యులు కలిశారు. ఇమ్రాన్‌ను కలిసి కొన్ని నెలలు అవుతోందని తనయుడు సులైమాన్ ఖాన్ చెప్పారు.గత మార్చి నుంచి తాను, తన సోదరుడు కాసిం ఖాన్ తమ తండ్రిని కలవలేదని అన్నాడు. తండ్రిని కలిసేందుకు అనుమతించడం లేదన్నాడు. ప్రస్తుతం కాసిం ఖాన్, సులైమాన్ ఖాన్.. ఇద్దరూ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. తమ తండ్రి ఆరోగ్యం బాగాలేదని, అతడికి అత్యవసర చికిత్స అవసరమని వారు అంటున్నారు. ఈ విషయంలో ప్రపంచం స్పందించి, తమకు సాయం అందించాలని కోరుతున్నారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇమ్రాన్‌ను కలిసేందుకు పాక్ ప్రభుత్వం ఎవరినీ అనుమతించడం లేదు. ఆ సమయంలో ఇమ్రాన్ సోదరి పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ గురించి అభ్యంతరకవ్యాఖ్యలు చేశారు. అప్పటినుంచి ఇమ్రాన్‌ను కలిసేందుకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తోంది. గత ఫిబ్రవరి 14న పలువురు అంతర్జాతీయ రిటైర్డ్ క్రికెటర్లు పాక్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇమ్రాన్‌ను విడుదల చేయాలని, ఆయనకు న్యాయ సహాయం అందించాలని కోరారు. కానీ, పాక్ ప్రభుత్వం మాత్రం స్పందించలేదు.


## అల్లర్లలో పాల్గొంటే పాస్‌పోర్ట్ రద్దు.. ఢిల్లీ పోలీసుల నిర్ణయం!




**న్యూఢిల్లీ: జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** హింసాత్మక నిరసనల్లో పాల్గొన్న వారిపై కఠిన వైఖరిని అవలంబించేందుకు ఢిల్లీ పోలీసులు సంసిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉన్న చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు అల్లర్లలో పాల్గొన్నట్లు తేలిన వ్యక్తులపై పోలీసులు పాస్‌పోర్ట్ రద్దు ప్రక్రియలను కూడా ప్రారంభిస్తారు. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఈనెల 20న చలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పార్లమెంట్ చుట్టూ ఉన్న భద్రతా బారికేడ్లను నిరసనకారులు ఛేదించేందుకు ప్రయత్నించడంతో చెలరేగిన హింస నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో భద్రతా దళాలు బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీచార్జ్‌లకు పాల్పడటం, అల్లర్ల నిరోధక వాహనాలను మోహరించడం వంటివి చేశాయి.

## హిమాచల్ ప్రదేశ్‌లో దారుణం..

**-వాహనంపై విరిగిపడ్డ కొండచరియలు.. 13 మంది మృతి**



**న్యూఢిల్లీ: జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక టాక్సీ వాహనంపై కొండ చరియలు విరిగిపడటంతో 13 మంది మరణించారు. ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం, ఉదయ్‌పూర్-కిల్లార్ రోడ్డు మార్గంలో, కాడు నల్లాహ్ సమీపంలో జరిగింది. 15 మందితో ఒక టాటా సుమో ఈ మార్గంలో, పర్వతం దిగువ నుంచి వెళ్తుండగా ఉన్నట్లుండి పైనుంచి కొండచరియలు విరిగిపడ్డాయి. అందులో భారీ బండరాళ్లు వాహనంపై పడటంతో టాటా సుమో నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న 13 మంది మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే, ఈ ఘటనకు ముందు.. గురువారం రోజే ఈ మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు వాహనాల్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. వాహనదారులు టిండి గ్రామంలో ఉండాలని అధికారులు సూచించారు. అనంతరం శుక్రవారం ఉదయం రోడ్డుపై రాళ్లను తొలగించిన అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించారు. ఆ తర్వాత కాస్సేపటికే ఈ ప్రమాదం జరిగింది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 130కిపైగా రోడ్లు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. సిమ్లా, చంబాతోపాటు అనేక ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో రవాణాకు ఆటంకం ఏర్పడుతోంది.

## కర్ణాటక-ఆంధ్ర మధ్య.. 3, 4వ రైల్వే లైన్‌కు కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ: జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ మధ్య కీలక మార్గంలో 3, 4వ రైల్వే లైన్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ ప్రాజెక్ట్‌కు లైన్ క్లియర్ చేసింది. కర్ణాటకలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్లు రైల్వే డివిజన్లలో 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణ ప్రాజెక్ట్‌ను రూ. 1,264 కోట్లతో చేపట్టనున్నారు. 2028-29 నాటికి ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని ప్రతిపాదించారు. కాగా, కర్ణాటక, ఆంధ్రాలోని మూడు జిల్లాల గుండా సాగే ఈ మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్ట్ ద్వారా భారతీయ రైల్వే నెట్‌వర్క్ సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరిస్తుంది. ఏడు లక్షల జనాభా కలిగిన సుమారు 99 గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుంది. బళ్లారి కోట, కుమార స్వామి ఆలయంతో సహా దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. అలాగే ఇనుప ఖనిజం, డోలమైట్, సున్నపురాయి, ఇనుము, ఉక్కు, బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి సరుకుల రవాణాకు ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు ఒక కీలక మార్గంగా ఉంటుంది. ఏటా అదనంగా 16.22 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కాక్రోచ్ పార్టీ నిరసనలో పాల్గొననున్న మమతా బెనర్జీ



**న్యూఢిల్లీ: జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జాతీయ రాజకీయాల్లో మరోసారి కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు. పోటీ పరీక్షల్లో సంస్కరణలు కోరుతూ యువత చేపట్టిన ఉద్యమానికి ఆమె తన మద్దతు ప్రకటించారు. ఇందులో భాగంగా, జూలై 27న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొంటానని శుక్రవారం వెల్లడించారు. ఇదే సమయంలో, లోక్‌సభలో టీఎంసీ పార్లమెంటరీ పార్టీ ఉప నాయకుడిగా సీనియర్ నేత సౌగతా రాయ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. బీర్భూమ్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన నటి, రాజకీయ నాయకురాలు శతాబ్ది రాయ్ స్థానంలో సౌగతా రాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# నిరాహార దీక్ష ఎందుకు విరమించానంటే..


**-సోనమ్ వాంగ్‌చుక్ కీలక ప్రకటన**



**న్యూఢిల్లీ: జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ శుక్రవారం తన దీక్ష విరమించిన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమక్షంలో 26వ రోజు ఆయన నిరాహార దీక్ష విరమించారు. అయితే, ఆయన ప్రధాన డిమాండ్ అయిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే సోనమ్ దీక్ష విరమించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై సోనమ్ వాంగ్‌చుక్ స్పందించారు. తాను ఎందుకు దీక్ష విరమించాల్సి వచ్చిందో వెల్లడించారు. " నా దగ్గర రెండే దారులున్నాయి. ఒకటి నిరాహార దీక్ష కొనసాగించడం లేదా దీక్ష ముగించి ఉద్యమాన్ని కొనసాగించడం. వేలాది మంది నేను దీక్ష విరమించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ప్రాణాన్ని పణంగా పెట్టడంకంటే ఉద్యమాన్ని కొనసాగించమే ముఖ్యమని చాలామంది సూచించారు. భవిష్యత్ పోరాటాల కోసం నేను జీవించి ఉండటం చాలా ముఖ్యం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయనంతమాత్రాన ఈ ఉద్యమం విఫలమైనట్లు కాదు. ఆయన రాజీనామా చేయకపోవడం వల్ల విద్యార్థులకు పెద్దగా నష్టం లేదు. కానీ, ధర్మేంద్రకు ఉన్న గుర్తింపు మాత్రం పోతుంది. ఒకవేళ ఆయన రాజీనామా చేసి ఉంటే, తన పేరు చెడిపోకుండా ఉండేది అని సోనమ్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఉండకూడదని, కేసులు నమోదైతే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే విషయం తనకు తెలుసన్నారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని సోనమ్ తెలిపారు. పేపర్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతుందన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని ఆయన వెల్లడించారు.


# లండన్ లగ్జరీ హోటల్‌లో సౌదీ రాకుమారుడు మృతి

**-అతిగా డ్రగ్స్ సేవించడమే కారణం**



**న్యూఢిల్లీ: జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** లండన్‌లోని ఒక లగ్జరీ హోటల్‌లో సౌదీ రాకుమారుడు మృతిచెందాడు. ఈ ఘటన గత ఏడాది నవంబర్ 25న జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు మాత్రం ఆలస్యంగా వెలుగుచూశాయి. సౌదీ ప్రిన్స్ అయిన అబ్దుల్లా బిన్ ఫహద్ బిన్ అబ్దుల్లా బిన్ అబ్దులాజిజ్ బిన్ జలావి అల్ సౌద్ అనే 29 ఏళ్ల సౌదీ రాకుమారుడు యూకే, లండన్‌లోని కెన్సింగ్టన్‌లో ఉన్న మారియట్ అనే లగ్జరీ హోటల్‌లో మరణించాడు. అతడు గత ఏడాది నవంబర్ 19న హోటల్ నుంచి సిగరెట్ కోసం బయటకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత అతడు వారంపాటు కనిపించలేదు. ఆ తర్వాత హోటల్ సిబ్బంది రూమ్ క్లీన్ చేయడం కోసం హెటల్ గదికి వెళ్లి చూడగా, అక్కడ బాత్ రూమ్‌లో ఫ్లోర్‌పై పడిపోయి కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని హోటల్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్‌కు తెలిపారు. వైద్య సిబ్బంది వచ్చి అతడిని రక్షించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ అతడు ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై లండన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. అతడి రక్త నమూనాలు సేకరించారు. దీనికి సంబంధించిన వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. అతడు అపరిమితంగా డ్రగ్స్‌తోపాటు, ఆల్కహాల్, ఇతర ఔషధాలు తీసుకున్నట్లు తేలింది .ఈ కారణంగా.. అధిక స్థాయి డ్రగ్స్, అన్నింటి కాంబినేషన్ కారణంగా కార్డియాక్ అరెస్టుకు గురై మరణించినట్లు నివేదిక తేల్చింది. ఈ విషయాన్ని ఇన్నర్ వెస్ట్ లండన్ కార్నర్ కోర్టుకు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో అతడి మరణం వెనుక ఎలాంటి కుట్ర లేదని, మరో వ్యక్తి ప్రమేయం లేదని కూడా దర్యాప్తు అధికారులు తేల్చారు. మరోవైపు సౌదీ రాకుమారుడి మృతిని సౌదీ రాయల్ కోర్టు కూడా అధికారికంగా ధృవీకరించింది. అతడికి రియాద్‌లోని వీఐపీ ఇమామ్ తుర్కీ బిన్ అబ్దుల్లా మసీదులో అంత్యక్రియలు నిర్వహించినట్లు వెల్లడించింది.

# అప్పుడు అభిమానం.. ఇప్పుడు విమర్శలు.. మూడేళ్లలో సీన్ రివర్స్..!



**న్యూఢిల్లీ:జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** మూడేళ్ల కాలంలో.. తనను అభిమానించిన వ్యక్తే తనకు వ్యతిరేకి అవుతాడని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఊహించి ఉండరు. తనను మెచ్చుకున్న మంత్రి రాజీనామా కోసం ఆమరణ దీక్షకు పూనుకుంటానని సోనమ్ వాంగ్‌చుక్ సైతం అనుకోని ఉండరు. కానీ, మే 3న జరిగిన నీట్ ప్రశ్నాప్రత్నం లీకేజీ, మే 21న పరీక్ష రద్దు.. తదనంతర పరిణామాలు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థిలోకాన్ని జంతర్ మంతర్ తోవ తొక్కేలా చేశాయి. ఇంకేముంది.. బాధితుల పక్షాన నిలబడి, అన్యాయాన్ని ప్రశ్నించే గొంతుక అవ్వాలనుకున్నారు సోనమ్. అంతే.. ఒకప్పుడు ధర్మేంద్ర ప్రధాన్‌ను అభిమానించిన సోనమ్ వాంగ్‌చుక్ ఆయనకు వ్యతిరకేకంగా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

**2023 మార్చిలో**

విద్యావ్యవస్థలో సంస్కరణలకు పాటుపడుతున్నందుకు సోనమ్, ఆయన భార్య అన్మోగ్ గీతాంజలిని 2023 మార్చిలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు. ఆ దంపతుల కృషిని ప్రశంసించిన ఆయన వారితో ఫొటో దిగారు. జాతీయ విద్యావిధానం -- 2020ను గ్రామీణ, కింది స్థాయిలోనూ అమలు చేయాలని ఈ సందర్భంగా మంత్రిని సోనమ్ కోరారు కట్ చేస్తే.. మూడేళ్లు గిర్రున తిరిగాయి. నీట్ లీకేజీకి జవాబుదారీగా ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో సోనమ్ ఆమరణ నిరాహార దీక్ష చేశారు. 21 రోజుల జంతర్ మంతర్ వద్ద.. ఆపై సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో.. అట్నుంచి మేదాంత ఆస్పత్రిలో ఆయన ఫాస్టింగ్ కొనసాగించారు. 26వ రోజున కేంద్ర మంత్రులు జేడీ నడ్డా, జితేంద్ర సింగ్‌ల హామీతో సోనమ్ తన దీక్షను విరమించారు. దాంతో, మూడేళ్ల క్రితం సోనమ్ దంపతులు ధర్మేంద్ర ప్రధాన్‌తో దిగిన దిగిన ఫొటో ప్రస్తుతం వైరలవుతోంది.

# జంతర్ మంతర్‌కు దూరంగా ఉండండి

**-ఢిల్లీ యూనివర్సిటీ**




**న్యూఢిల్లీ:జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** నీట్, ఇతర పరీక్షల ప్రశ్నపత్రాలపై సీజేపీ ఢిల్లీలో చేపట్టిన ఆందోళనకు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తుంది. జంతర్ మంతర్ వద్ద ఇంకా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనల్లో పాల్గొనవద్దని ఢిల్లీ యూనివర్సిటీ తన విద్యార్థులకు సూచించింది. అదేవిధంగా నకిలీ వార్తలు, ఏదైనా సమాచారం షేర్ చేసేముందు అప్రమత్తంగా ఉండాలని యూనివర్సిటీలోని అన్ని శాఖలకు తెలిపింది. జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నియంత్రిస్తారని వెల్లడించింది. ఇలాంటి కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొంటే న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ చట్టపరమైన చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలుగుతుందని, వృత్తిపరమైన అవకాశాలపై ప్రభావం పడుతుందని వెల్లడించింది. అదేవిధంగా వ్యక్తిగత భద్రతకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అందుకే వాటికి దూరంగా ఉండాలని పేర్కొన్నది. నకిలీ వార్తలు పెరిగిపోతున్నాయని, ఏదైనా సమాచారాన్ని పంచుకునే ముందు, దానిపై స్పందించే ముందు ఆ సమాచారంపై పూర్తి అవగాహన ఉండాలని, జాగ్రత్త వహించాలని సూచించింది.

**పాకిస్తాన్ సోషల్ మీడియాల నిలిపివేత**

ఈ ఆందోళనల నేపథ్యంలో తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న పాకిస్తాన్ సోషల్ మీడియాలను నిలిపివేశామని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఆ దేశానికి చెందిన సుమారు 480 సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేశామని వారు తెలిపారు. ఆ దేశ సోషల్ మీడియా ఖాతాలు తప్పుడు సమాచారాన్ని, తప్పుదోవ పట్టించే పోస్టులను వ్యాప్తి చేస్తూ తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఇలాంటి నిజం కాని కంటెంట్‌కు దూరంగా ఉండాలని, వాటికి బలి కావద్దని వారు సూచించారు.

## ఇజ్రాయెల్‌లో భారతీయుడి అనుమానాస్పద మృతి



**న్యూఢిల్లీ: జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** ఇజ్రాయెల్‌లో ఓ భారతీయుడు (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం తెల్లవారుజామున అపార్ట్‌మెంట్‌లోని ఓ గదిలో అతడు రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ హత్య చేసినట్లు భావిస్తున్న ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. కొన్నేళ్ల క్రితం భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్లిన వలస కూలీ అయిన వ్యక్తి జెరూసలెంలోని కటమోన్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం. అతడితో ఉన్న వివాదం కారణంగా అనుమానితుడు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని.. పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

# నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా విద్యాసంస్థల బంద్ విజయవంతం

**- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**
**- ఏఐఎస్ఎఫ్ ,ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యుఐ, బీసీ జనసేన విద్యార్థి విభాగం**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యుడు ఆకాష్ నాయక్ , ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్,ఎన్ ఎస్ యు ఐ , బిలాల్ , బీసీ జనసేన విద్యార్థి విభాగం అఖిల్ ,పేర్కొన్నారు.రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించడం విద్యార్థుల ఆందోళనకు లభించిన మద్దతుకు నిదర్శనమని అన్నారు. నీట్ పరీక్షల




నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధంగా పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం బాధాకరమని విమర్శించారు.విద్యా వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలకు విద్యార్థి సంఘాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్,శివ రాంచరణ్, రోహిత్ సృజన్ ,వంశీ , రహన్ ,ప్రవీణ్ వికాస్ , ఏఐఎస్ఎఫ్ నాయకులు నూతన్ హర్షిత్, గణేష్, పవన్, సాయి చవాన్, మరియు విద్యార్థి సంఘ నాయకులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు

# నారాయణపేట జిల్లాలో మహిళ దారుణ హత్య



మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గత పది రోజుల క్రితం జాదరవ్ పల్లి గ్రామానికి చెందిన శాంతమ్మ మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు నిన్న సాయంత్రం నారాయణపేట మండలం జాజపూర్ గ్రామ శివారులో ఉన్నా ఓ చెరువు దగ్గర చెట్ల పొదల్లో శవమై కనిపించిన శాంతమ్మ మృతదేహం మహిళ ఒంటిపై బంగారు వెండి నగలు ఉండడంతో వాటి కోసమే హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్న పోలీసులు పోస్టుమార్టం తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

# ఒక్క ఓటు కూడా వృధా కానివ్వం..

**-షాద్ నగర్ అసెంబ్లీలో 80% పూర్తయిన "సర్" ప్రక్రియ..**
**-నియోజక వర్గంలో ఇప్పటికే 1 లక్షా 99వేల 311 ఓట్ల మ్యాపింగ్**
**-షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్**
**-మండలాల వారీగా ఓటు సంరక్షణకు కాంగ్రెస్ కృషి..**
**-పత్రికా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడి**
**-మండలాల వారీగా ప్రక్రియ గురించి వివరించిన "కాంగ్రెస్ మండలాధ్యక్షులు"**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** సర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటు ప్రక్షాళన కార్యక్రమంలో షాద్ నగర్ అసెంబ్లీ వ్యాప్తంగా ఒక్క ఓటు కూడా వృధా కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్" అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్ర నేత రాహుల్ గాంధీ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సర్ ప్రక్రియను నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆయా మండల పార్టీల నాయకులు ఈ విషయంలో ఎక్కడా పెడచెవిన పెట్టకుండా పార్టీ అప్పగించిన పనిని గ్రామ గ్రామాన మెజార్టీ వంతున పూర్తి చేస్తున్నారని, బిఎల్ఏలు కూడా చురుకుగా వ్యవహరిస్తున్నారని ఆయన వెల్లడించారు. నియోజక వర్గంలో ఉన్న 150 గ్రామపంచాయతీలు 268 పోలింగ్ బూత్ లలో విజయవంతంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి మండలంలో ప్రతి 10 బూతులకు ఒక సూపర్వైజర్ ను ఏర్పాటు చేయడంతో పాటు మండలాల వారీగా ఇన్చార్జిలను కూడా నియమించడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో ఇప్పటికీ 1, 99,311 ఓట్ల మ్యాపింగ్ జరిగిందన్నారు. 13923 ఓట్లకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలకు తమ ఓట్లు షిఫ్ట్ చేసుకోవడం, రెండు చోట్ల ఓట్లు కలిగి ఉండడం, ఓటర్ల వివరాలు తెలియకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికి 80 శాతం ప్రక్రియ పూర్తయ్యాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సూచించిన ప్రకారం ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ మీద ఉందన్నారు. రెండు ఓట్లు ఉన్నవారు ఒకే చోట తమ ఓటును నిర్ణయించుకోవాలని, రెండు చోట్ల ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఒక సంవత్సరం జైలు ఊచలు కూడా లెక్క పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజమైన ప్రజాస్వామ్యానికి సర్ ప్రక్రియ ఉపయోగపడుతుందని అన్నారు. కానీ కొన్నిచోట్ల కేంద్ర ప్రభుత్వ కుట్రతో మైనారిటీల ఓట్లు, ఎస్సీ ఎస్టీల ఓట్లు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గల్లంతయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అలాంటి పరిస్థితి లేకుండా కాంగ్రెస్ పార్టీ అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు.

**మున్సిపాలిటీలు, మండలాల వారీగా ఇలా..**

షాద్ నగర్ మున్సిపాలిటీని తీసుకుంటే ఇక్కడ 48 బూతులకు సంబంధించి 53,586 ఓట్లు ఉన్నట్లు ఉన్నట్టు కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ తెలిపారు. ఇందులో 31,8 84 ఓట్లు డిజిలటైజేషన్ జరిగినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే శంకర్ సూచనతో ప్రతిరోజు వార్డుల వారీగా అందరినీ అప్రమత్తం చేస్తూ పనులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఫరూక్ నగర్ మండలం మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ వివరిస్తూ ఇక్కడ 61 బూతులకు గాను 50వేల 407 ఓట్లు ఉండగా 92 శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. 46,747 ఓట్లు పూర్తికాగా 3,147 ఓట్లు పెండింగ్లో ఉన్నాయని వివరించారు. 15 గ్రామాలలో 100% పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లేడు చౌదరిగుడా మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ వివరిస్తూ.. 32 బూత్ లకు గాను 2,564 ఓట్లు ఉండగా ఇందులో 97.15% ఓటర్ మ్యాపింగ్ పూర్తయ్యాయని అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. కేవలం మూడు శాతం మాత్రమే మిగిలి ఉన్నాయని స్పష్టం చేశారు. కేశంపేట మండల వివరాలను పార్టీ అధ్యక్షుడు అనుమగల రమేష్ వివరిస్తూ 43 బూతులు ఉండగా ఇక్కడ 95.5% ప్రక్రియ పూర్తయినట్లు పార్టీ మండల అధ్యక్షుడు తెలిపారు. ఇక్కడ 31, 376 ఓట్లు పూర్తికాగా 800 ఓట్లు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీలో ప్రక్రియ పూర్తయినట్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఇక మండల పరిధిలో 95% ప్రక్రియ పూర్తయిందని మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి అన్నారు. 29 బూత్ లకు గాను 24,426 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 19,313 మందికి సంబంధించి ఓట్ల ప్రక్రియ పూర్తయింది అన్నారు. నందిగామ మండలంలో 28 బూత్ లకు గాను 89% ప్రక్రియ పూర్తయినట్లు మండల అధ్యక్షుడు కుమారస్వామి వెల్లడించారు. చేగూరు గ్రామంలో మొత్తం ఆరు బూతులలో మూడు బూతులు 100% ప్రక్రియ పూర్తయిందని, మొదట్లో కూడా ప్రాంతంలో 83% పూర్తి చేసినట్లు తెలిపారు. కొందుర్గు మండలంలో 23,432 ఓట్లకు గాను 21, 222 ఓట్ల ప్రక్రియ పూర్తయినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కె.పురుషోత్తం రెడ్డి తెలిపారు.1760 ఓట్లు మాత్రమే ఇక్కడ పెండింగ్ లో ఉన్నాయన్నారు. 98. 15% ఓట్ల ప్రక్రియ ఇక్కడ పూర్తయిందని స్పష్టం చేశారు. పత్రికా సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, పి రఘునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, నర్సప్పగూడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ అణచివేతపై కోస్గిలో హోరెత్తిన ధర్నా





**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 24**
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు అరాచకంగా లాఠీచార్జ్ చేయడం టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ప్రధాని నివాస ముట్టడికి పూనుకున్నారు.ఈ క్రమంలో వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కోస్గి మున్సిపల్ పరిధిలోని శివాజీ చౌక్ లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘం జేఏసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమంలో విద్యార్థులు రైతులు మహిళలు యువత వివిధ పార్టీల రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై పోలీసుల బలప్రయోగంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని నాయకులు మండిపడ్డారు.విద్యార్థులపై ప్రజా నాయకులపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలంతా ఏకమై పాల్గొనడంతో ఈ ధర్నా కార్యక్రమం అత్యంత విజయవంతమైంది.

# రైతు చెమటకు గౌరవంగా.. పొలంలో కేటీఆర్ జన్మదిన సంబరాలు

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**
**వ్యవసాయ క్షేత్రంలో వినూత్నంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు...**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24 (బ్యూరో, జర్నలిస్ట్ డైరీ)**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ నియోజకవర్గంలోని లింగారెడ్డిగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ భీశ్వ మాధవి -- రామకృష్ణ దంపతుల వ్యవసాయ క్షేత్రంలో వినూత్నంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రైతు సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో కేటీఆర్ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. రైతును గౌరవించే భావనతో వ్యవసాయ క్షేత్రంలో జన్మదిన వేడుకలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేటీఆర్ మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ సహకార యూనియన్ కార్పోరేషన్ చైర్మన్ రాజవరప్రసాద్, మాజీ స్త్రీ శిశు సంక్షేమ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మండల, గ్రామ, వార్డు పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్కూల్ బస్సు కింద పడి విద్యార్థి మృతి

**చౌదర్‌గూడ మండలం**
**కాస్లాబాద్‌లో విషాదం..**
**డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** చౌదర్‌గూడ మండలం కాస్లాబాద్ గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. స్కూల్ బస్సు కింద పడి యూకేజీ చదువుతున్న చిన్నారి సహస్ర మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాస్లాబాద్ గ్రామానికి చెందిన కృష్ణయ్య--మనీష దంపతుల కుమార్తె సహస్ర స్థానిక అబ్యాస్ విద్యాపీఠం పాఠశాలలో యూకేజీ చదువుతోంది. ప్రతిరోజులాగే శుక్రవారం ఉదయం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లిన చిన్నారి, సాయంత్రం ఇంటి వద్ద బస్సు నుంచి దిగిన అనంతరం జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. స్థానికుల వివరాల ప్రకారం.. చిన్నారిని ఇంటి వద్ద దించిన అనంతరం డ్రైవర్ బస్సును వెనక్కి తీస్తున్న సమయంలో వాహనం వెనుక ఉన్న సహస్రను



గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని స్థానికులు వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్తులు కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**డ్రైవర్ నిర్లక్ష్యంపై ఆందోళన**

ఘటనకు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల రవాణాలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, బస్సుల వద్ద సహాయక సిబ్బందిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, డ్రైవర్ నిర్లక్ష్యం, స్కూల్ యాజమాన్యం బాధ్యతలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో పాఠశాల బస్సుల భద్రత, డ్రైవర్ల అప్రమత్తత, విద్యార్థుల రవాణా వ్యవస్థపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్నారుల ప్రాణాల భద్రత విషయంలో నిర్లక్ష్యం పునరావృతం కాకుండా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కేటీఆర్ జన్మదిన సందర్బంగా సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**- అనాథలకు,వృద్ధులకు దుప్పట్లతో పాటు ప్రత్యేక భోజన సౌకర్యాలు ఏర్పాటు**

**- పాల్గొన్న పట్టణ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు షాద్ నగర్ పట్టణ కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు,బీఆర్ఎస్ నాయకులు.ఈ సందర్బంగా సమాజంలోని నిరుపేదలు,అనాథలు,వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని షాద్ నగర్ పట్టణం లోని మలయాళ స్వామి ఆశ్రమం మరియు ఆర్టిసి కాలనిలోని నవోదయ వృద్ధ ఆశ్రమంలో నివసిస్తున్న వారికి దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు ప్రత్యేక భోజన సౌకర్యాన్ని కల్పించారు.ఈ సందర్బంగా కేటీఆర్ జన్మదినాన్ని కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం చేయకుండా,సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం బీఆర్ఎస్ పార్టీ సంప్రదాయమని పేర్కొన్నారు. అనాథలు,వృద్ధులతో కలిసి సమయం గడిపి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు బీఆర్ఎస్ నాయకులు.వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు అనిత రఘునాథ్ యాదవ్,బిఎస్ సుధీర్,గౌస్ జానీ,మాజీ కౌన్సిలర్లు చింటూ ప్రతాప్ రెడ్డి,ఈశ్వర్ రాజు, కానుగు అనంతయ్య,మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి,యువ నాయకులు దినేష్ సాగర్,సరికొండ మల్లేశ్,బాధేపల్లి గోపాల్ గౌడ్,అశోక్, సంతోష్ యాదవ్,వసీం,తమ్మగొండ సురేష్,అరుణ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఏకీకరణ కమిటీ సమావేశం



**హైదరాబాద్ జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ ఉద్యమకారుల ఏకీకరణ కమిటీ కన్వీనర్ మల్లారి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ తెలంగాణ ఉద్యమ సంఘాల ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జూలై 6 నుంచి 23 వరకు ప్రభుత్వ నియామకంలోని కే.కే. కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకారులతో జరిగిన చర్చలపై సమీక్ష నిర్వహించారు. ఈ చర్చలు సానుకూలంగా, సాఫీగా ముగిశాయని సమావేశంలో పాల్గొన్న ఉద్యమకారులు అభిప్రాయపడ్డారు.అలాగే, చర్చల సారాంశాన్ని కే.కే. కమిటీ తక్షణమే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అవసరమైతే తెలంగాణ ఉద్యమకారుల ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి శ్రీమతి సోనియా గాంధీ, శ్రీ రాహుల్ గాంధీలను కలిసి తమ సమస్యలను వివరించి, డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు వెల్లడించారు.

ఈ సమావేశంలో సుల్తాన్ యాదగిరి, తుమ్మల ప్రపోల్ రాంరెడ్డి, బత్తుల సోమయ్య, కొంతం యాదగిరి రెడ్డి, రామగిరి ప్రకాష్, పండు గౌడ్, జానకి రెడ్డి, కోతి మాధవి, వి. అరుణ, జెనిగే విష్ణువు, అనుముల రవీందర్, బీరకాయల మధుసూదన్, గౌరీ గణేష్, జనగాని రాజు గౌడ్, సాయిబాబా, రాంబాబు, జనార్ధన్, శంకర్, లక్ష్మణ్, కంది నారాయణ, కుప్ప శ్రీనివాస్ గౌడ్, అమర్, బండ నర్సింగ్ తదితర తెలంగాణ ఉద్యమ నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో విజయవంతంగా విద్యాసంస్థలు బంద్

**విద్యార్థులపై లాఠీ చార్జ్ లు సిగ్గుచేటు ఎన్ఎస్ యుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్**




**ఆమనగల్లు జూలై24 (జర్నలిస్ట్ డైరీ)** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ మరియు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు విజయవంతంగా బంద్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ విద్యార్థులతో మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని మరియు ఎన్ టిఏ ని బ్యాండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ పై జరిగిన నిర్బంధ చర్యలు, విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జ్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల గొంతును అణిచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, వారి న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ నాయకులు మహేష్, శివ,సలీం,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని అతిక్రమించి ఇంటర్నెట్ నిలిపివేత: భద్రత పేరుతో స్వేచ్ఛకు తాళం?

ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన శాంతియుత నిరసన ఎంత ముఖ్యమో, సమాచార ప్రసారం కూడా అంతే ప్రాథమికమైనది. ఆధునిక కాలంలో ఇంటర్నెట్ కేవలం వినోద సాధనం కాదు. అది భావ ప్రకటనా స్వేచ్ఛ, సమాచార హక్కు, విద్య, ఉపాధి, వ్యాపారం, బ్యాంకింగ్, అత్యవసర సేవలు, పౌర భాగస్వామ్యానికి వెన్నెముకగా మారింది. అలాంటి పరిస్థితిలో ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నిరసనల సందర్భంగా ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, దాని చట్టబద్ధత, అవసరం, నిష్పాక్షికతపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. భద్రత అవసరమే అయినప్పటికీ, దానికి ఎంచుకునే మార్గం రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉందా అనే ప్రశ్న మరింత కీలకమైంది.భారత రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ, సమాచార హక్కును పౌరులకు కల్పించింది. డిజిటల్ యుగంలో ఈ హక్కులు ఇంటర్నెట్‌తో విడదీయరాని సంబంధాన్ని ఏర్పరచుకున్నాయి. అందుకే ఇంటర్నెట్‌ను నిలిపివేయడం అనేది కేవలం సాంకేతిక నిర్ణయం కాదు. అది పౌర హక్కులపై ప్రత్యక్ష ప్రభావం చూపే పరిపాలనా చర్య. అందువల్ల అలాంటి నిర్ణయం తీసుకునేటప్పుడు ప్రభుత్వం అత్యంత జాగ్రత్త, పారదర్శకత, చట్టబద్ధమైన సమర్థన చూపాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది.భారతదేశంలో ఇంటర్నెట్ నిలిపివేతకు చట్టపరమైన ఆధారం ప్రధానంగా 2017లో రూపొందించిన టెలికాం సేవల తాత్కాలిక నిలిపివేత నిబంధనలు. ప్రజా భద్రత లేదా అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే ఈ అధికారాన్ని వినియోగించాలని చట్టం చెబుతుంది. అయితే "ప్రజా భద్రత" లేదా "అత్యవసర పరిస్థితి" అనే పదాలకు స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల వాటిని ఎవరి ఇష్టానికి వారు సొంత అర్థాలు చెప్పుకొని విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. ఫలితంగా అసాధారణ పరిస్థితుల కోసం ఉద్దేశించిన అధికారాలు కొన్నిసార్లు సాధారణ నిరసనల సందర్భాల్లో కూడా ఉపయోగిస్తున్నారనే విమర్శలు కనిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు 2020లో అనురాధ భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పు అత్యంత ప్రాధాన్యమైనది. నిరవధికంగా ఇంటర్నెట్ నిలిపివేయడం చట్టబద్ధం కాదని, ప్రతి ఆదేశం అవసరం, అత్యవసర కారణాలతో, పరిమిత కాలవ్యవధి వంటి ప్రమాణాలను తప్పనిసరిగా



పాటించాలని కోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు, ప్రభుత్వం జారీ చేసే నిలిపివేత ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వాటిపై న్యాయపరమైన సమీక్షకు అవకాశం ఉండాలని కూడా పేర్కొంది. అంటే ఇంటర్నెట్ నిలిపివేత ప్రభుత్వ విచక్షణాధికారంగా కాకుండా రాజ్యాంగపరమైన పరీక్షకు లోబడి ఉండాల్సిన చర్యగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.అయితే ఆచరణలో ఈ ప్రమాణాలు అమలవుతున్నాయా అనే ప్రశ్నకు లేదు అనే సమాధానం ఎదురవుతోంది. చాలా సందర్భాల్లో ఉత్తర్వులు ఆలస్యంగా బయటకు రావడం, కారణాలు స్పష్టంగా వెల్లడించకపోవడం, ప్రభావిత ప్రాంతాల పరిమితిని ఖచ్చితంగా వివరించక పోవడం వంటి అంశాలు పారదర్శకత లోపాన్ని సూచిస్తున్నాయి. ఒకవైపు ప్రజలు సమాచారానికి దూరమవుతుంటే, మరోవైపు వదంతులు మరింత వేగంగా వ్యాపించే ప్రమాదం కూడా పెరుగుతుంది. సమాచార ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయడం కొన్నిసార్లు సమస్యను తగ్గించకుండా మరింత సంక్లిష్టం చేసే అవకాశమూ ఉంటుంది.ఇంటర్నెట్ నిలిపివేత ప్రభావం కేవలం నిరసనకారులపైనే ఉండదు. ఆన్‌లైన్ తరగతులు, డిజిటల్ చెల్లింపులు, ఆసుపత్రుల సేవలు, అత్యవసర సమాచార మార్పిడి, చిన్న వ్యాపారాలు, ఫ్రీలాన్సర్లు, గిగ్ వర్కర్లు, ఈ-కామర్స్ వ్యవస్థలు అన్నీ దెబ్బతింటాయి. డిజిటల్ ఇండియా లక్ష్యాలను ప్రకటిస్తున్న దేశంలో, అదే సమయంలో తరచూ ఇంటర్నెట్ నిలిపివేతలను ఆశ్రయించడం విధానపరమైన వైరుధ్యాన్ని బయటపెడుతోంది.

ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ నిలిపివేతల విషయంలో భారతదేశం తరచూ అత్యధిక సంఖ్యలో నమోదవుతున్న దేశాలలో ఒకటిగా స్వతంత్ర పరిశీలనా సంస్థలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా "యాక్సెస్ నౌ " వంటి సంస్థల నివేదికలు భారతదేశంలో ఇటువంటి చర్యలు ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోలిస్తే అధికంగా నమోదవుతున్నాయని సూచించాయి. ప్రతి నిలిపివేతతో ఆర్థిక వ్యవస్థకు కోట్ల రూపాయల నష్టం మాత్రమే కాదు, దేశం పెట్టుబడులకు అనుకూలమైన డిజిటల్ గమ్యస్థానమనే ప్రతిష్ఠ కూడా దెబ్బతింటుంది.నిజానికి ప్రజా శాంతి భద్రతలను కాపాడడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ఆ బాధ్యత పేరుతో మొత్తం ప్రాంత ప్రజలను డిజిటల్ చీకటిలోకి నెట్టడం చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండాలి. ప్రమాదం ఉన్న నిర్దిష్ట ప్రాంతాలు, నిర్దిష్ట సేవలు లేదా నిర్దిష్ట కాలవ్యవధికి మాత్రమే పరిమితమైన లక్ష్యం కోసం, పరిమిత ద్దేశ్యం కోసమే చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి మరింత అనుకూలమైన మార్గం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న సమయంలో పూర్తి స్థాయి బ్లాకౌట్ కంటే తక్కువ ప్రభావం కలిగించే ప్రత్యామ్నాయాలు కూడా ప్రభుత్వాల ముందున్నాయి.ఢిల్లీ ఘటన మరోసారి ఒక మౌలిక ప్రశ్నను ముందుకు తెచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి అసమ్మతిని నియంత్రించే అధికారం ఉందా, లేక శాంతియుతంగా వ్యక్తమయ్యే అసమ్మతిని రక్షించే బాధ్యత ఉందా? భద్రత, స్వేచ్ఛ రెండూ పరస్పర విరుద్ధ అంశాలు కావు. ఒకటి కోసం మరొకటి త్యాగం చేయాల్సిన అవసరం లేదు. చట్టబద్ధమైన, పారదర్శకమైన, ప్రతిపాదిత నిర్ణయాల ద్వారానే ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధ్యమవుతుంది. డిజిటల్ యుగంలో ఇంటర్నెట్‌ను ఇష్టం వచ్చినట్టు పోలీసుల సూచనతో నిలిపివేయడం అనేది కేవలం ఒక సాంకేతిక బటన్ నొక్కడం కాదు. అది ప్రజాస్వామ్య హృదయ స్పందనను తాత్కాలికంగా నిలిపివేసే చర్య. అందుకే అలాంటి అధికారాన్ని అత్యంత అరుదుగా, అత్యంత బాధ్యతాయుతంగా మాత్రమే వినియోగించాలి.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్. 9849328496**
ramkishore.1504@gmail.com

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం: మామిడి సోమయ్య




**కూకట్‌పల్లి, (జూలై 24) జర్నలిస్ట్ డైరీ.** జర్నలిస్టుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య స్పష్టం చేశారు. కూకట్‌పల్లిలోని ఏఎస్ రాజు నగర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం నిర్వహించిన టిడబ్ల్యూజేఎఫ్ కూకట్‌పల్లి నియోజకవర్గ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు.సంఘం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం టిడబ్ల్యూజేఎఫ్ అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. జర్నలిస్టులను విభజించడం ద్వారా వారి సమస్యల పరిష్కారాన్ని ఆలస్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.అనంతరం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం ప్రతిపాదించిన కూకట్‌పల్లి నియోజకవర్గ కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.కొత్త కమిటీ ఎన్నిక కూకట్‌పల్లి నియోజకవర్గ టిడబ్ల్యూజేఎఫ్ కమిటీకి అధ్యక్షుడిగా ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగుల అంజిబాబు, కోశాధికారిగా షబ్బీర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొమ్మ గోపి, కార్యవర్గ సభ్యులుగా నవీన్, సుజాత, నాగరాజు గౌడ్, శ్యాంసుందర్, సైదులు ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు విద్యా వెంకట్, టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు దామెర జగదీశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగరాజు గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ రవికుమార్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు వంగాల కొండల్ రెడ్డి, చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు



**నిడమానూరు, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** ముప్పారం గ్రామానికి చెందిన మూగల అజయ్ కుమార్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు 2016-2017 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి సహపాఠులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. అజయ్ కుమార్ మృతివార్త తెలుసుకున్న వెంటనే తోటి మిత్రులు ఏకమై, ఆయన కుటుంబానికి ఆసరాగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో అజయ్ కుమార్ కుమార్తె విద్యాభ్యాసానికి ఉపయోగపడేలా రూ.30 వేల నగదు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా సహపాఠులు మాట్లాడుతూ, చిన్ననాటి స్నేహం ఎప్పటికీ మరువలేనిదని, తమ ప్రాణ స్నేహితుడి కుటుంబానికి తమ వంతు సహాయం అందించడం బాధ్యతగా భావించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగమల్ల కోటేష్, పగడాల రాకేష్, బొడ్డు శశికుమార్, మాతంగి పరుశురాం, గణపురం రామకృష్ణ, బొడ్డు శివకుమార్, చరక ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలతో సేవా కార్యక్రమాలు

**తిరుమలగిరి సాగర్, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కే.టి. రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పురాతన పాటిమీద ఆంజనేయస్వామి దేవాలయం మరియు నాగులవారి శివాలయంలో పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కేటీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు పిడిగం నాగయ్య ముదిరాజ్ మాట్లాడుతూ, కేటీఆర్ పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఆయన, ఐటీ రంగంలో తెలంగాణకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని



కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చవ్వ నాసర్ రెడ్డి, పగడాల పెద్దిరాజు, మేకపోతుల కార్తీక్, జాటావత్ రమేష్, రామావత్ భాను, నర్సింగ్, వెంకన్న, శాగం కోటిరెడ్డి, దుబ్బాకోటేష్, వీరబోయిన మల్లికార్జున్, జూపల్లి గోపి, అంగోత్ స్వామి, వల్లపు యల్లయ్య, దండెం శ్రీను, వెంకటేశ్వర్లు, కోరట బూడిద శ్రీను, కొడవత్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ కోర్టు పరిసరాల్లో మౌలిక వసతుల సమస్యలపై స్పందించిన మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి






**హయత్‌నగర్; జూలై 24 (జర్నలిస్ట్ డైరీ)** హయత్‌నగర్ కోర్టు పరిసర ప్రాంతంలో డ్రైనేజీ అవుట్‌లెట్లు సరిగా లేకపోవడం, వర్షపు నీటి ప్రవాహానికి ఉపయోగపడే రైన్ వాటర్ అవుట్‌లెట్లు మూసుకుపోవడం, పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు పనిచేయకపోవడంతో ప్రజలు, న్యాయవాదులు మరియు కోర్టుకు వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పలువురు న్యాయవాదులు మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో, ఆయన వెంటనే స్పందించి సంబంధిత జలమండలి అధికారులు, స్ట్రీట్ లైట్ విభాగం సిబ్బందితో కలిసి శుక్రవారం కోర్టు పరిసర ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ వ్యవస్థ, రైన్ వాటర్ అవుట్‌లెట్లు, స్ట్రీట్ లైట్ల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన నవజీవన్ రెడ్డి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని, ప్రజా సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రియాంక, హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ పంతులు, ప్రధాన కార్యదర్శి ఎ. రామ్ మోహన్, లేడీ ప్రతినిధి భార్గవి, స్పోర్ట్స్ సెక్రటరీ మసీదు శివ, కార్యవర్గ సభ్యులు సాయి కృష్ణ, గోపి శంకర్, మాధురి, పద్మ, సతీష్ రాజా, సాంబశివుడు, బార్ సభ్యులు కె. సురేందర్ రెడ్డి, హేమంత్ ప్రవీణ్, శంకర్ మంచాల, మేకల సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ





### రికార్డులు, కేసుల దర్యాప్తు, శాంతిభద్రతలపై సమగ్ర సమీక్ష పోలీసు సేవలు మరింత ప్రజానుకూలంగా ఉండాలని సూచన

**చింతపల్లి, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు శుక్రవారం చింతపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, నేరాల నమోదు, పెండింగ్ కేసుల దర్యాప్తు, కేసుల పరిష్కార విధానం, స్టేషన్ నిర్వహణ, ఆయుధాగారం, మాల్ఖానా, విజిటర్ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు రికార్డులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోలీసు అధికారులతో సమావేశమైన డీఎస్పీ శ్రీనివాసరావు, ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో స్వీకరించి చట్టపరంగా వేగంగా పరిష్కరించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు మరింత అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంచేలా సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ రాజు, ఎస్ఐ ముత్యాల రామూర్తి డీఎస్పీకి స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ చర్యలు, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలను వివరించారు. ఈ వార్షిక తనిఖీలో సీఐ రాజు, ఎస్ఐ ముత్యాల రామూర్తి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ కొత్తపేట డివిజన్ ఉపాధ్యక్షుడిగా శివరాజ్ పాటిల్ నియామకం



**కొత్తపేట, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కొత్తపేట డివిజన్ ఉపాధ్యక్షుడిగా సత్యనగర్ కాలనీకి చెందిన శివరాజ్ పాటిల్‌ను నియమిస్తూ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంచి రాజేష్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పార్టీ మరియు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అలాగే పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ నూతన ఉపాధ్యక్షుడు శివరాజ్ పాటిల్‌ను అభినందించి పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ కౌన్సిల్ సభ్యురాలు కాటా విజయ, కొత్తపేట డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మెరుగు వైజయంతి, డివిజన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్, సీనియర్ అడ్వకేట్ సురేందర్, కాట రాజేష్ గౌడ్ (ఖన్నా) తదితరులు పాల్గొని శివరాజ్ పాటిల్‌కు అభినందనలు తెలిపారు.

## 4కోట్ల వ్యయంతో బొల్లారంలో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన

### ప్రారంభించిన ఎమ్మెల్యే కూందురు జైవీర్ రెడ్డి



**గుర్రంపోడు, జూలై 24, (జర్నలిస్ట్ డైరీ) :** గుర్రంపోడు మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో రూ. 4 కోట్ల భారీ వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి (సబ్ స్టేషన్) నాగార్జున సాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు కూందురు జైవీర్ రెడ్డి ఘనంగా శంకుస్థాపన చేశారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ కేంద్రం ద్వారా స్థానిక రైతులకు, ప్రజలకు నాణ్యమైన కరెంట్ అందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెలగపూడి రాంబాబు రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బొమ్ము శ్రీనివాస్, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గాలి రవికుమార్, జిల్లా కార్యదర్శి నరసింహారావు, మాజీ ఎంపీపీ చలమల మాధవి జగదీశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వెల్గపురి కరుణాకర్ రావు, సూదిని జగదీశ్వర్ రెడ్డి , ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడి వెంకన్న, కుప్ప అమరేందర్, ప్రభుత్వ అధికారులు ఎమ్మార్వో కరుణ శ్రీ, ఎంపీడీవో మహేష్, విద్యుత్ శాఖ యస్ ఈ శ్రీనివాస్, డీఈ బాలు నాయక్, ఏడీ సాగర్ రెడ్డి, ఏఈ శ్రీకాంత్ రెడ్డిలతో పాటు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ మేకల కోటిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల, యువ నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేసి ఆస్పత్రి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్





**దేవరకొండ, జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను దేవరకొండ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జీ రమావత్ రవీంద్ర కుమార్ హాజరై దేవరకొండ బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఆయన అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, కేటీఆర్ తెలంగాణ అభివృద్ధికి దూరదృష్టితో పనిచేసిన నాయకుడని కొనియాడారు. ఐటీ రంగ విస్తరణ, పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన అందించిన సేవలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే నాయకుడిగా కేటీఆర్ ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా అనాథ చిన్నారులకు పుస్తకాలు, గొడుగుల పంపిణీ

### పంపిణీ చేసిన రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్



**చైతన్యపురి; జూలై 24 (జర్నలిస్ట్ డైరీ) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని చైతన్యపురి డివిజన్ పరిధిలోని పనిగిరి కాలనీలో ఉన్న ఆదర్శ అనాథ శరణాలయంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన "గిఫ్ట్ ఎ స్మైల్" కార్యక్రమంలో భాగంగా 50 మంది చిన్నారులకు ఎగ్జామ్ ప్యాడ్స్, నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రి, గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కేటీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఆనందంగా ఉందని, సమాజంలోని నిరుపేదలు, అనాథ చిన్నారులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు చూడటం తమకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు బాశెట్టి అజయ్ కుమార్, యాదగిరి ముదిరాజ్, కడియం మోహన్, రవి యాదవ్, రాకేష్, సాయి యాదవ్, తోట శ్రీనివాస్ యాదవ్, కె.వి. స్వామి, పోలీస్ శీను, శ్రావణ్, లక్కీ, సాయి ప్రసాద్, రమేష్, ఆసిఫ్, ట్రోని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఇన్ఫోసిస్ లాభం 7,769 కోట్లు

న్యూఢిల్లీ,
ఇన్ఫోసిస్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.7,769 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 12.2 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14 శాతం ఎగబాకి రూ.48,211 కోట్లకు చేరుకున్నది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికిగాను ఆదాయంలో వృద్ధి 1.5 శాతం నుంచి 3 శాతం లోపు ఉండవచ్చునని తన గైడెన్స్‌లో పేర్కొంది. స్థూల ఆర్థిక పరిస్థితులు అనిశ్చితిగా ఉండటం వల్లనే ఈ ఏడాది ఆదాయంలో వృద్ధి సింగిల్ డిజిట్‌కు పరిమితంకానున్నదని కంపెనీ సీఈవో, ఎండీ సలీల్ పరేఖ్ తెలిపారు. ఉద్యోగుల పరిహారం పెంపు రెండు విడుతలగా అక్టోబర్, జనవరి నుంచి అమల్లోకి తీసుకురానున్నట్టు చెప్పారు. ఇన్ఫోసిస్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కంపెనీ సీఈవోగా ఆశీష్ కుమార్ దాస్ నియమితులయ్యారు. ఈ నియామకం వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నది.




## ఐదో రోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

**సెన్సెక్స్ 331 పాయింట్లు పతనం**



భారత స్టాక్ మార్కెట్ శుక్రవారం వరుసగా ఐదోరోజు నష్టాల్లో ముగిసింది. మార్కెట్ నష్టాల్లో ముగియడం మదుపర్లకు ఆందోళన కలిగిస్తోంది. బీఎస్ఈ సెన్సెక్స్ 331 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 102 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ ఆటో, రియాల్టీ, ఫార్మా షేర్ల అమ్మకాల ఒత్తిడి కారణంగా మార్కెట్ నష్టాల బాటలో సాగింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, దీని కారణంగా ద్రవ్యోల్బణం పెరగుతుందనే భయం, చమరు ధరలు పెరగడం వంటివి మార్కెట్ వరుస నష్టాలకు కారణం.ఉదయం సెన్సెక్స్ 75,708.19 పాయింట్ల వద్ద నష్టాల్లోనే ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఒక దశలో 75,474.43 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. చివరకు 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 102.15 పాయింట్ల నష్టంతో 23,767.45 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ట్రెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎల్ అండ్ టీ పవర్ గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, భారత్ ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్ షేర్ ఒక శాతం పడిపోయింది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర పెరుగుతోంది. శుక్రవారం బ్యారెల్ క్రూడాయిల్ ధర 97.68 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4059 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది.

## ఒకేసారి 10 మోడళ్లను ఆవిష్కరించిన హోండా

దేశీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని హోండా ఒకేసారి 10 కొత్త ద్విచక్ర వాహన మోడళ్లను ఆవిష్కరించింది. వీటిలో పూర్తిగా కొత్తగా అభివృద్ధి చేసిన ఏడు మోడళ్లు ఉండగా, మిగిలినవి అప్‌డేటెడ్ వెర్షన్లుగా కంపెనీ విడుదల చేసింది. భారత వినియోగదారుల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికత, మెరుగైన పనితీరు, ఇంధన సామర్థ్యంతో ఈ మోడళ్లను రూపొందించినట్లు హోండా తెలిపింది. కొత్త మోడళ్లతో దేశీయ మార్కెట్లో తమ వాటాను మరింత విస్తరించాలనే లక్ష్యంతో కంపెనీ ముందుకు సాగుతోంది.




# శ్రేయస్ అయ్యర్ అరుదైన వరల్డ్ రికార్డు..

**-వరుసగా 8 టాస్‌లు గెలిచి సరికొత్త చరిత్ర**

టీమిండియా కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వరుసగా ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో టాస్ గెలిచిన తొలి సారథిగా చరిత్ర సృష్టించాడు. ఈ రికార్డుతో ఇప్పటివరకు ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా, భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ప్రత్యేక రికార్డును కూడా అధిగమించాడు. ఈ రికార్డు ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా ఏడు టాస్‌లు గెలిచిన బహామాస్ కెప్టెన్ గ్రెగొరీ టేలర్‌పై ఉంది. అదే విధంగా, 2010 నుంచి 2012 మధ్య టీమిండియాకు నాయకత్వం వహించిన ఎంఎస్ ధోనీ కూడా వరుసగా ఏడు టాస్‌లు గెలిచి భారత రికార్డు సృష్టించారు. ఇప్పుడు శ్రేయస్ అయ్యర్ వరుసగా ఎనిమిది టాస్‌లు గెలిచి ఇద్దరి రికార్డులను అధిగమిస్తూ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాడు.టాస్ విషయంలో అదృష్టం కలిసొచ్చినట్లే, మ్యాచ్ ఫలితంలో కూడా శ్రేయస్ అయ్యర్‌కు శుభారంభమే లభించింది. హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో



టాస్ గెలిచిన అయ్యర్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 125/7 పరుగులకే పరిమితమైంది. భారత యువ పేసర్ మయాంక్ యాదవ్ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. తన వేగవంతమైన బౌలింగ్‌తో రెండు కీలక వికెట్లు పడగొట్టి 2/18 గణాంకాలు నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గాను అతను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఇక 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తుఫాన్ ఆరంభాన్ని అందించాడు. కేవలం 18 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అతని మెరుపు ఇన్నింగ్స్ మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పేసింది. వైభవ్ ఇచ్చిన బలమైన ఆరంభాన్ని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28లి), ఇషాన్ కిషన్ (35) చక్కగా కొనసాగించారు. ఇద్దరూ బాధ్యతాయుతంగా ఆడి భారత్‌ను ఎలాంటి ఒత్తిడి లేకుండా విజయతీరాలకు చేర్చారు.

భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఒకవైపు వరల్డ్ రికార్డు, మరోవైపు కెప్టెన్‌గా తొలి విజయం సాధించిన శ్రేయస్ అయ్యర్‌కు ఈ మ్యాచ్ చిరస్మరణీయంగా మారింది. యువ ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో భారత జట్టు సిరీస్‌ను విజయంతో ప్రారంభించగా, మిగతా రెండు మ్యాచ్‌లపైనా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ఆసియా క్రీడల క్వార్టర్ ఫైనల్లో భారత్..
## నాకౌట్‌లో తలపడే జట్లు ఇవే..!

జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడలు 2026 క్రికెట్ నాకౌట్ బెర్తులు ఖరారయ్యాయి. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ మెగా టోర్నీకోసం గురువారం డ్రా తీయగా భారత పురుషుల జట్టు నేరుగా నాకౌట్‌కు దూసుకెళ్లింది. టీమిండియాతో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ సైతం క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. మహిళల విభాగంలోనూ భారత్ సహా నాలుగు జట్లు క్వార్టర్ ఫైనల్ ఆడనున్నాయి.ఆసియా క్రీడల క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్ వచ్చేసింది. జపాన్ వేదికగా జరుగనున్న ఈ మెగా ఈవెంట్ డ్రా తీయగా.. భారత పురుషుల, మహిళల జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో మిగిలిన వాటిని క్వార్టర్స్‌కు క్వాలిఫయింగ్ రౌండ్ కోసం ఆరు జట్లను రెండు గ్రూపులుగా విభజించారు.గ్రూప్ ఏలో అఫ్గనిస్థాన్, జపాన్, నేపల్ ఉండగా.. గ్రూప్ బీలో హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ జట్లు నిలిచాయి. మహిళల క్రికెట్ విభాగంలో అవసరం లేకుండానే ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. నేరుగా నాకౌట్ పోరు




నిర్వహించనుండగా టీమిండియాతో జపాన్ తలపడనుంది. ఈ మ్యాచ్ విజేత బంగ్లాదేశ్, చైనా మ్యాచ్ గెలుపొందిన జట్టను ఢీకొట్టనుంది.

**సెప్టెంబర్ 17 నుంచి..**

ఆసియా క్రీడల్లో క్రికెట మ్యాచ్‌లు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు జరుగనున్నాయి. పురుషుల జట్ల మ్యాచ్‌లు సెప్టెంబర్ 24వ తేదీన మొదలై అక్టోబర్ 1వ తేదీన పూర్తవుతాయి. కానీ, మహిళల జట్ల మ్యాచ్‌లు మాత్రం ఆరు రోజుల్లోనే ముగియనున్నాయి. సెప్టెంబర్ 17 నుంచి సెప్టెంబర్ 22 వరకూ మహిళల ఛాంపియన్ ఎవరో తేలియనుంది.

## స్పోర్ట్స్

## ఓటీటీలో వరల్డ్‌కప్ మేనియా..
## వారంలో కోటిన్నర వ్యూస్‌తో రికార్డు..!




ఫిఫా వరల్డ్‌కప్ ముగిసినా.. స్టార్ ఆటగాళ్ల ప్రదర్శనను, సంచలన విజయాలను, గోల్స్ రికార్డులను అభిమానులు గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. ఈ మెగా టోర్నీని జీ5 చానెల్‌లో జోరుగా వీక్షించిన ఫ్యాన్స్.. ఓటీటీలో మాత్రం రెప్పవాల్చకుండా చూసేశారట. తాజాగా ఒర్మాక్స్ స్ట్రీమ్‌వ్యూ ర్యాంకింగ్స్‌లో ఈ విషయం బయటపడింది. ఫిఫా వరల్డ్‌కప్ పోటీలకు ఓటీటీలో అత్యధిక వ్యూస్ వచ్చాయని, ఏకంగా 1.5 కోట్లమంది సాకర్ పండుగను వీక్షించి మురిసిపోయారని ఈ ర్యాంకింగ్స్ పేర్కొంది.అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఫిఫా వరల్డ్‌కప్‌ను భారతీయులు తెగ చూశారు. లియోనల్ మెస్సీ, కిలియన్ ఎంబాపే, క్రిస్టియానో రొనాల్డో.. వంటి స్టార్ ఆటగాళ్లు పోటీపడిన ఈ ఈవెంట్‌ను కళ్లార్పకుండా చూశారు. టీవీలో, ఓటీటీలో.. తమ సౌకర్యాన్ని బట్టి ఈ మెగా టోర్నీని వీక్షించారని ఒర్మాక్స్ స్ట్రీమ్‌వ్యూ ర్యాంకింగ్స్ తెలిపింది. జూలై 13-19 .. ఈ చివరి వారంలో ప్రపంచకప్ పోటీలకు సాధారణం కంటే 40 శాతం వీక్షణలు అధికంగా వచ్చాయట.అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకూ జరిగిన మ్యాచ్‌లను ఎంతో ఉత్సాహంగా అభిమానులు చూశారని ఒర్మాక్ స్ట్రీమ్‌వ్యూ ర్యాంకింగ్స్‌తో వెల్లడైంది. జూలై 1 నుంచి జూలై 19 మధ్య జీ5లో వరల్డ్‌కప్‌లను చూసేవారి సంఖ్య 79 శాతం పెరిగిందని ఈ ర్యాంకింగ్స్ ద్వారా స్పష్టమైంది. జూలై 13-19 మధ్య జియో హాట్‌స్టార్‌లో భారత్, ఇంగ్లండ్ మధ్య టీ20 సిరీస్‌ను 1.37 కోట్ల మంది చూశారు. ఇదే వారంలో ఇండియాస్ గాట్ టాలెంట్ సీజన్ 2కు 90 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. సాధారణంగా అన్ని ఆటల కంటే క్రికెట్‌కే అధిక ప్రాధాన్యమిచ్చే భారతీయులు.. ఫుట్‌బాల్‌ను ఈ రేంజ్‌లో ఆస్వాదించడం నిజంగా వండరే.లీగ్ దశనుంచి ఆద్యంతం సంచలనాలతో రంజుగా సాగిన ఫిఫా వరల్డ్‌కప్‌లో స్పెయిన్(ూజుఝఱఅ) విజేతగా నిలిచింది. జూలై19, ఆదివారం న్యూ జెర్సీ మైదానంలో జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను(ూతీస్త్రవఅ్‌ఱఅఝ) 0-1తో ఓడించిన యూరప్ జట్టు.. రెండోసారి ట్రోఫీని ముద్దాడింది.



సెగలు పుట్టించే అందాలతో కాజల్ అగర్వాల్ ను ఇలా చూస్తుంటే...


# 'రామాయణ' ట్రైలర్‌కు బ్రేక్..

**- కానీ మేకర్స్ నుంచి అదిరిపోయే గ్లోబల్ అప్‌డేట్!**




భారతీయ సినీ ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'రామాయణ' ఒకటి. దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌లో రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించగా, దానికి అద్భుతమైన స్పందన లభించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో ట్రైలర్‌ను ఎప్పుడు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.అయితే, ట్రైలర్ విడుదల కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ ఊహించని షాక్ ఇచ్చారు. ముందుగా అనుకున్న తేదీన ట్రైలర్‌ను విడుదల చేయకుండా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ట్రైలర్‌ను మరింత గ్రాండ్‌గా తీసుకురావాలనే ఉద్దేశంతో కొత్త తేదీలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అయితే కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. అయితే ట్రైలర్ వాయిదా వార్తతో పాటు అభిమానులకు మరో భారీ సర్‌ప్రైజ్ కూడా అందించారు. 'రామాయణ' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదల చేసేందుకు ప్రముఖ హాలీవుడ్ స్టూడియో సోనీ పిక్చర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో 'రామాయణ' గ్లోబల్ మార్కెట్‌లో మరింత విస్తృత స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. భారతీయ పురాణ గాథను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయాలనే లక్ష్యంతో చిత్రబృందం అడుగులు వేస్తున్నట్లు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రైలర్ విడుదల కొంత ఆలస్యమైనప్పటికీ, సోనీ పిక్చర్స్ భాగస్వామ్యంతో వచ్చిన ఈ అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఇప్పుడు అందరి దృష్టి ట్రైలర్ కొత్త రిలీజ్ డేట్‌పైనే ఉంది. మేకర్స్ త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.






# వరుస పరాజయాలతో పూజా హెగ్డే కెరీర్ డౌన్..

**-రవితేజ సినిమాపైనే ఆశలు!**



ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా అగ్రహీరోల సరసన వరుస అవకాశాలు అందుకున్న పూజా హెగ్డే ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. భారీ చిత్రాల్లో నటించినప్పటికీ వరుస పరాజయాలు ఆమె జోరుకు బ్రేక్ వేశాయి. దీంతో ఒకప్పుడు నిర్మాతల ఫస్ట్ ఛాయిస్‌గా ఉన్న ఈ బ్యూటీ ఇప్పుడు కొత్త అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూజా హెగ్డే నటించిన సినిమాల్లో 'రాధేశ్యామ్', 'ఆచార్య', 'బీస్ట్', 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' వంటి భారీ అంచనాల చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. తాజాగా విడుదలైన 'జన నాయగన్' కూడా అంచనాలకు తగ్గట్టుగా వసూళ్లు సాధించలేకపోవడంతో పూజా ఖాతాలో మరో ఫ్లాప్ చేరినట్లైంది. వరుసగా వచ్చిన ఈ పరాజయాలు ఆమె మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.ఇండస్ట్రీలో వినిపిస్తున్న కథనాల ప్రకారం, భారీ పారితోషికం డిమాండ్ చేయడం కూడా నిర్మాతలను ఆలోచనలో పడేస్తోందని టాక్. మరోవైపు ఇటీవల ఆమె నటించిన కొన్ని చిత్రాల్లో పాత్ర నిడివి తగ్గిపోవడం, ఎడిటింగ్ సమయంలో కీలక సన్నివేశాలు తొలగించబడటం కూడా చర్చనీయాంశమైంది. దీంతో ముఖ్యంగా తెలుగులో కొత్త అవకాశాలు ఆశించిన స్థాయిలో రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సినిమాల్లో సక్సెస్ లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం పూజా హెగ్డే క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇన్‌స్టాగ్రామ్ సహా ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉంది. ఫోటోషూట్లు, బ్రాండ్ ప్రమోషన్లు, ఎండార్స్‌మెంట్ల ద్వారా ఆమె ఇప్పటికీ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ బ్రాండ్లకు ఆమె ఇప్పటికీ ప్రాధాన్యమైన సెలబ్రిటీగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం పూజా హెగ్డే చేతిలో పెద్ద ప్రాజెక్టులు లేకపోయినా, మాస్ మహారాజా రవితేజ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆగస్టులో ఈ సినిమా ప్రారంభమయ్యే అవకాశమున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. టాలీవుడ్‌లో ఒకప్పుడు గోల్డెన్ లెగ్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన పూజా హెగ్డే ఇప్పుడు తప్పనిసరిగా ఒక బ్లాక్‌బస్టర్ హిట్ కోసం ఎదురుచూస్తోంది. రవితేజ సినిమా ఖరారైతే అది ఆమె కెరీర్‌కు కీలక మలుపుగా మారే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత మళ్లీ విజయాల బాట పట్టి స్టార్ హీరోయిన్‌గా తన స్థానాన్ని తిరిగి సంపాదిస్తుందా లేదా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# 'మంగళవారం 2'పై అజయ్ భూపతి బిగ్ అప్‌డేట్..

**ఈసారి సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న సీక్వెల్!**

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన మేకింగ్ స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో దర్శకుడిగా సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'మహాసముద్రం' తో నిరాశపరిచినా, 'మంగళవారం' చిత్రంతో మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, మోహన్ బాబు, నరేష్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాలు వెల్లడించారు.మంగళవారం' చిత్రానికి సీక్వెల్‌పై వస్తున్న వార్తలకు అజయ్ భూపతి అధికారికంగా స్పందించారు. 'మంగళవారం 2' తప్పకుండా తెరకెక్కుతుంది. ఈసారి ప్రేక్షకులు ఊహించని స్థాయిలో కథను సిద్ధం చేస్తున్నాం. మొదటి భాగానికి పూర్తి భిన్నంగా, మరింత థ్రిల్లింగ్ అనుభూతిని అందించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈసారి కథలో సూపర్ నేచురల్ అంశాలకు పెద్దపీట వేస్తున్నామని అజయ్ భూపతి వెల్లడించారు. ప్రతి పాత్ర, ప్రతి సంఘటన ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' పనుల్లో పూర్తిగా బిజీగా ఉన్నానని, ఆ సినిమా విడుదలైన తర్వాత పూర్తిస్థాయిలో 'మంగళవారం 2' స్క్రిప్ట్‌పై దృష్టి పెడతానని తెలిపారు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'మంగళవారం 2' కథను అజయ్ భూపతి దర్శకుడు కొరటాల శివకు వినిపించినట్లు తెలుస్తోంది. కథ నచ్చడంతో ఆయన తన నిర్మాణ సంస్థ యువసుధా ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. 'మంగళవారం' సినిమాలో గ్రామీణ వాతావరణం, వరుస రహస్య మరణాలు, పాయల్ రాజ్‌పుత్ నటన, అజనీష్ లోక్‌నాథ్ అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు రెండో భాగంలో సూపర్ నేచురల్ అంశాలు కూడా జతకానుండటంతో ఈ సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అజయ్ భూపతి తాజా వ్యాఖ్యలతో 'మంగళవారం 2' టాలీవుడ్‌లో ఇప్పటి నుంచే హాట్ టాపిక్‌గా మారింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465